ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 27 | మే | 2024
పేజీలు 6

## జిల్లాలో పుష్ప 3




- రూ.2 కోట్ల 50 లక్షల గంజాయి పట్టివేత
- పట్టుబడ్డ గంజాయి 1035 కేజీలు
- బస్సు సీట్ల కింద అరలు, డిక్కీలో గంజాయి మూటలు
- పనస గాయ లోడ్‌లో గంజాయి ప్యాకెట్లు
- భద్రాచలం వద్ద రెండు వాహనాల్లో 427 కేజీలు
- మూడు ఘటనల్లో సరుకు, వాహనాలు స్వాధీనం, 14 మంది అరెస్ట్

2లో

# నేడే మండలి పోలింగ్






- బరిలో 52 మంది
- 4,63,839 మంది ఓటర్లు
- 605 పోలింగ్ కేంద్రాలు
- పోలింగ్ కేంద్రాలకు తరలిన సామాగ్రి
- ఎనిమిది గంటల నుంచి నాలుగు గంటల వరకు పోలింగ్
- ఓటర్లను ఆకట్టుకునే పనిలో అభ్యర్థులు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం వరంగల్ నల్గొండ శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నికకు సంబంధించి సోమవారం పోలింగ్ జరగనుంది. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరగనుంది. 12 జిల్లాల పరిధిలోని 4,63,839 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో అత్యధికంగా ఖమ్మంజిల్లాలో 83,879 మంది ఓటర్లు ఉండగా ఆ తర్వాత స్థానంలో నల్గొండలో 80,871 మంది ఓటర్లు ఉన్నారు. సూర్యాపేటలో 51,497 మంది ఓటర్లు నమోదు కాగా స్వల్పంగా సిద్దిపేట జిల్లాలో 4,679 మంది ఓటర్లు ఉన్నారు. సిద్దిపేట, జనగామ, హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, జయశంకర భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, నల్గొండ జిల్లాల పరిధిలోని పాత ఉమ్మడి ఖమ్మం నల్గొండ వరంగల్ జిల్లాల పరిధిలోని పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందు కొరకు మొత్తం 600 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. అత్యధికంగా ఖమ్మంలో 115, నల్గొండలో 95 బూత్

మిగతా 2లో..

## తొలి ప్రాధాన్యతే కీలకం

### ఎలిమినేషన్ ప్రారంభమైతే ప్రధాన అభ్యర్థులకు ఇబ్బందులే







**ప్రజాపక్షం/ఖమ్మం :** శాసన మండలికి సోమవారం జరుగుతున్న ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు తొలి ప్రాధాన్యత ఓటు అత్యంత కీలకమైంది. శాసన మండలి ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు గెలుపు ప్రకటనకు సంబంధించి చాలా మందికి అవగాహన ఉండే ఉంటుంది. ఖచ్చితంగా 50 శాతానికి పైబడి ఓట్లు సాధించిన వారే విజేతలుగా నిలుస్తారు. ఒకవేళ 50 శాతానికి పైబడి తొలి ప్రాధాన్యత ఓట్లలో రాకపోతే తొలగింపు ప్రక్రియ (ఎలిమినేషన్) రౌండ్ ప్రారంభమవుతుంది. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తర్వాత అతి తక్కువ ఓట్లు లభించిన అభ్యర్థిని ఎలిమినెట్ చేసి ఆ అభ్యర్థికి తొలి ప్రాధాన్యత ఓటేసిన వారు రెండవ ప్రాధాన్యత ఓటును ఎవరికి వేశారనేది పరిశీలిస్తారు. అలా ఎలిమినేషన్ రౌండ్‌లో ఏ అభ్యర్థికైనా 50 శాతానికి పైబడి ఓట్లు వచ్చేంత వరకు లెక్కింపు జరుగుతుంది. ఒకవేళ చివరి వరకు ఎలిమినేషన్ రౌండ్ నిర్వహించిన 50 శాతానికి పైబడి ఓట్లు రాకపోతే అత్యధిక ఓట్లు సాధించిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పక్షాన పోటీ చేసిన తీన్మార్ మల్లన్న మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే గెలుపొందాలి. లేకుంటే ఇబ్బందులు తప్పవని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ దఫా పోటీ చేసిన 52 మందిలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, బిఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి, బిజెపి అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తప్ప మిగిలిన వారు ఎవరు

మిగతా 2లో..

## పామాయిల్ హబ్‌గా ఖమ్మం



- ఏ ప్రభుత్వంలో ఉన్న రైతుల కోసమే పనిచేస్తా
- గోదావరి జలాలతో జిల్లాను సస్యశ్యామలం చేయడమే లక్ష్యం
- రైతుల అవగాహన సదస్సులో
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాష్ట్రంలోనే ఉమ్మడి ఖమ్మంజిల్లాను పామాయిల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తాను ఏ ప్రభుత్వంలో ఉన్నా రైతుల సంక్షేమం కోసమే పనిచేస్తానని మంత్రి తెలిపారు. ఆదివారం ఖమ్మం నగరంలోని బాలపేట వద్ద గల మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్ పామాయిల్ వ్యవసాయ క్షేత్రంలో గోద్రెజ్ కంపెనీ, పెదవేగి పామాయిల్ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రఘునాథపాలెం సొసైటీ ఛైర్మన్ తాతా రఘురాం అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా 10 లక్షల ఎకరాల్లో

మిగతా 2లో..

# నేడే మండలి పోలింగ్

(మొదటిపేజీ తరువాయి)
లను ఏర్పాటు చేయగా సిద్దిపేట జిల్లాలో కేవలం ఐదు బూత్‌లను మాత్రమే ఏర్పాటు చేశారు. ఇందు కొరకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. పోలింగ్ సామాగ్రిని పోలింగ్ కేంద్రాలకు తర లించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు పోలింగ్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తు న్నారు. ప్రత్యేక వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు సామాగ్రిని చేర్చడంతో పాటు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**ఆ ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ...** పట్టభద్రుల ఉప ఎన్నికల బరిలో 52 మంది అభ్యర్థులు ఉన్నప్పటికీ ప్రధానంగా కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి అభ్యర్థుల మధ్యనే పోటీ నెలకొననుంది. మిగిలిన పార్టీలకు చెందిన స్వతంత్ర అభ్యర్థులు ఎవరు ఈ దఫా ఎంఎల్‌సి ఎన్నికలపై ప్రభావం చూపే పరిస్థితి కనిపించడం లేదు. కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బిఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేష్‌రెడ్డి, బిజెపి నుంచి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పోటీ పడుతున్నారు. తీన్మార్ మల్లన్న గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గట్టి పోటీనిచ్చారు. ఎలిమినేషన్‌లో చివరి వరకు నిలబడి ద్వితీయ స్థానం పొందారు. అప్పటి బిఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి విజయం సాధించారు. గత ఎన్నికల్లో వామపక్షాల అభ్యర్థి జయ సారథి తో పాటు కోదండరాం, తీన్మార్ మల్లన్న పట్టభ ద్రుల ఓట్లను గననీయంగా సాధించారు. కాని ఈసారి ప్రభావితం చేయగలిగిన స్వతంత్ర అభ్యర్థులు ఎవరు బరిలో లేరన్నది వాస్తవం. తీన్మార్ మల్లన్న పక్షాన కాంగ్రెస్ పార్టీ మంత్రులు, శాసన సభ్యులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతునిచ్చిన సిపిఐ, సిపిఎం, టిజెఎస్ కార్యక ర్తలు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. మల్లన్న గెలుపు కోరుతూ ఇప్ప టికే పట్టభద్రులతో అనేక సమావేశాలు నిర్వహించారు. మంత్రులు, శాసన సభ్యులు, వామపక్ష పార్టీల అండ కాంగ్రెస్ అభ్యర్థికి దన్నుగా ఉంది. ఇక బిఆర్ఎస్ నుంచి పోటీ చేస్తున్న ఏనుగుల రాకేష్‌రెడ్డి తర పున బిఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రులు విస్తృత ప్రచారం నిర్వ హించారు. కెటి రామారావు, తన్నీరు హరీష్‌రావు విస్తృత ప్రచారం నిర్వహించారు. రాకేష్‌రెడ్డి వ్యక్తిత్వాన్ని హైలెట్ చేస్తూ బిఆర్ఎస్ నేతలు ప్రచారం నిర్వహించారు. బిజెపి అభ్యర్థిగా గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి రెండోసారి పోటీ పడుతున్నారు. ఆయన గత ఎన్నికల్లోను పోటీ చేసి నాల్గవ స్థానంలో నిలిచాడు. ఈసారి మోడీ చరిష్మా ఉందని నిరుద్యో గులు తమవైపే ఉన్నారని బిజెపి చెబుతుంది. బిజెపి పక్షాన రాష్ట్ర అధ్య క్షులు జి. కిషన్‌రెడ్డితో పాటు ఆ పార్టీ ఎంఎల్‌ఎలు, ఎంపిలు ప్రచారం నిర్వహించారు. మొత్తంగా అధికార, విపక్ష పార్టీలు ఈ ఎన్నికను ప్రతి ష్టాత్మకంగా తీసుకున్నాయి. బిఆర్ఎస్ నాయకులు పల్లా రాజేశ్వరరెడ్డి శాసన సభ్యునిగా ఎన్నిక కావడంతో ఆయన రాజీనామా ఫలితంగా ఉత్పన్నమైన ఈ ఎన్నికల్లో గెలిచి తమ స్థానాలు నిలబెట్టుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోను బిఆర్ఎస్ స్థానాన్ని చేజిక్కించుకోవాలని కాంగ్రెస్ హోరా హోరీ తలపడుతున్నాయి. బిజెపి సైతం మారిన పరిస్థితుల్లో తమకే అవ కాశం ఉందని భ్రమిస్తుంది. మొత్తంగా ఈ ఉప ఎన్నికతో రాష్ట్రంలో పెద్దగా మార్పులు రాకపోయినా మూడుజిల్లాలను ప్రభావితం చేసే ఈ ఉప ఎన్నికపై రాజకీయ పార్టీలు ప్రత్యేక దృష్టిసారించాయి.

| వరుస. సంఖ్య | జిల్లా పేరు | ఓటర్లు | పోలింగ్ బూత్‌లు |
|---|---|---|---|
| 1 | సిద్దిపేట | 4,679 | 05 |
| 2 | జనగామ | 23,419 | 27 |
| 3 | హన్మకొండ | 43,729 | 67 |
| 4 | వరంగల్ | 43,812 | 59 |
| 5 | మహబూబాబాద్ | 34,933 | 36 |
| 6 | ములుగు | 10,299 | 17 |
| 7 | భూపాలపల్లి | 12,535 | 16 |
| 8 | భద్రాద్రి కొత్తగూడెం | 40,106 | 55 |
| 9 | ఖమ్మం | 83,879 | 118 |
| 10 | యాదాద్రి భువనగిరి | 34,080 | 37 |
| 11 | సూర్యాపేట | 51,497 | 71 |
| 12 | నల్గొండ | 80,871 | 97 |
| మొత్తం | | 4,63,839 | 605 |

# తొలి ప్రాధాన్యతే కీలకం

(మొదటిపేజీ తరువాయి)
పెద్ద సంఖ్యలో ఓట్లు సాధించే అవకాశం లేదు. బిఆర్ఎస్ ద్వితీయ స్థానంలో నిలవవచ్చునని ఎన్నికల విశ్లేషకులు భావిస్తున్న సందర్భంలో బిజెపికి పడిన ఓట్లలో రెండవ ప్రాధాన్యత ఓటు తీన్మార్ మల్లన్నకు పడే అవకాశం లేదు. వ్యక్తిగతంగా కొందరు అభిమానులు వేసిన బిజెపి అభ్యర్థికి పడిన ఓట్లలో వ్యక్తిగా పడిన ఓట్ల కంటే రాజకీయ పార్టీ అభ్యర్థిగా పడిన ఓట్లే ఎక్కువగా ఉంటాయి. కాబట్టి బిజెపి ఆలోచన కలిగిన ఓటర్లు ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో రెండవ ప్రాధాన్యత ఓటును బిఆర్ఎస్‌కు వేసే అవకాశం ఉంటుంది. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల రాజకీయ పోకడలను పరిశీలిస్తే కాంగ్రెస్ అభ్యర్థి తొలి ప్రాధాన్యత ఓట్లతోనే గెలిచేందుకు కాంగ్రెస్ పార్టీతో పాటు కాంగ్రెస్ పార్టీని బలపరుస్తున్న సిపిఐ, సిపిఎం, టిజెఎస్ తదితర పార్టీలు విద్యార్థి, యువజన, ఉద్యోగ సంఘాలు ప్రయత్నించాల్సి ఉంది. గత ఎన్నికల్లో కోదండరాం, తీన్మార్ మల్లన్న, జయసారథి తీవ్రమైన ప్రభావాన్ని చూపించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అంతగా ప్రభావం చూపలేదు. బిఆర్ఎస్ తరుపున పోటీ చేసిన పల్లా రాజేశ్వరరెడ్డితో తీన్మార్ మల్లన్న ఢీ అంటే ఢీ అన్నారు. కారణాలు ఏమిటో కాని గతం మాదిరి తీన్మార్ మల్లన్నకు సానుకూల పవనాలు కనిపించడం లేదు. ఇప్పుడు కాంగ్రెస్‌ను బలపరుస్తున్న పార్టీలు మల్లన్న గెలుపును భుజాన వేసుకోవాల్సి ఉంటుంది. మల్లన్న తొలి ప్రాధాన్యత గెలుపు కోసం శ్రమించక పోతే అధికార పార్టీకి కొంత మేర ఇబ్బందులు తప్పక పోవచ్చు.

# జిల్లాలో పుష్ప 3




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పుష్ప 3 సినిమా సీన్లు చోటు చేసుకున్నాయి. అశ్వాపురం, అశ్వారావుపేట, భద్రాచలంలో మూడు చోట్ల ఆదివారం పోలీసులు 1035 కేజీల గంజాయిని పట్టుకున్నారు. పట్టుబడ్డ గంజాయి విలువ సుమారు రూ.2 కోట్ల 58 లక్షల 48 వేల 500 లగా ఎస్‌పి రోహిత్ రాజ్ నిర్ధారించారు. పోలీసులే అవాక్కయ్యేలా తరలింపు సీన్లు ఉండటంతో పుష్ప 1,2 కాకుండా ఇది ఏకంగా పుష్ప 3 అంటూ జిల్లా ప్రజలు చర్చించుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన (టిజిఎన్ఎబి తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో) వారిని సమన్వయం చేసుకుంటూ జిల్లా పోలీసులు మూడు ఘటనల్లో 1035 కేజీల గంజాయిని పట్టుకున్నారు. ఈ మూడు ఘటల్లో మొత్తం 14 మందిని అదుపులోనికి తీసుకున్న పోలీసులు గంజాయితో పాటు వాహనాలను స్వాధీనం చేసుకుని నిషేధిక గంజాయి స్మగ్లర్లను రిమాండ్‌కు తరలించారు.

అశ్వాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై తిరుపతి తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు ఏపిలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు నుండి ప్రత్యేకంగా ఓ ప్రైవేటు బస్సులో లోపలి సీట్లు క్రింది భాగాన్ని అరలుగా కత్తిరించి ఆ అరల్లో రూ. 62 లక్షల 7 వేల 500 విలువ చేసే 249 కేజీల గంజాయిని అమర్చారు. బస్సు వెనుక భాగంలోని డిక్కీలో కూడా గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. పుష్ప సినిమాను మించి పోయో విధంగా అరలు తయారు చేయడాన్ని చూసి పోలీసులే ఒక్క సారిగా షాక్ అయ్యారు. గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నారు.

భద్రాచలం పోలీస్ స్టేషన్ పరిధిలోని కూనవరం రోడ్‌లో ఎస్సై విజయలక్ష్మీ వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు వాహనాలు అతివేగంతా అటుగా వస్తున్నాయి. వాటిని ఆపి తనిఖీలు చేయడంతో 427కేజీల గంజాయి పట్టుబడింది. ఏపిలోని మోతుగూడెం, సుకుమామిడి నుండి ఏడుగురు వ్యక్తులు రెండు వాహనాల్లో ప్లేవుడ్ షీట్ల మాటున హైదరాబాద్ మూసాపేటకు తరలిస్తున్నారు. పక్క సమాచారం మేరకు రూ.1 కోటి 6 లక్షల 58 వేల విలువ చేసే 427 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోనికి తీసుకున్నారు.

అశ్వాపురం పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జంగారెడ్డి గూడెంలోని సాయిబాబా గుడివద్ద ఎస్సై శ్రీనివాస్ వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఒక బొలేరో వాహనంలో నలుగురు వ్యక్తులు పనసకాయ లోడోతో ఉన్నారు. ఆ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా పనసగాయ లోడ్ మాటున రూ.89 లక్షల 83ల వేల విలువ చేసే 359 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

# పామాయిల్ హబ్‌గా ఖమ్మం



(మొదటిపేజీ తరువాయి)
పామాయిల్ సాగుకు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చిందని దానికి అను గుణంగా రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు పామాయిల్ సాగుపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రైతులు పామాయిల్ సాగుపై దృష్టిసారిం చాలని తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ సాగులో ఇబ్బందులుపడుతున్న రైతులకు పామాయిల్ సాగు చేస్తే రైతులకు భరోసాతో పాటు భద్రత ఉంటుందని తెలిపారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధిం చవచ్చునని తెలిపారు. తాను కొన్నేళ్లుగా పామాయిల్ సాగు చేసినట్లు మంత్రి తెలిపారు. పామాయిల్ సాగు చేసే రైతులకు ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని తెలిపారు. కొన్నేళ్లుగా డ్రిప్ పథకం ఆగిపోయి దని దానిని పునరుద్ధరించి రైతులకు రాయితీపై డ్రిప్‌ను అందిస్తామని తెలిపారు. డ్రిప్ విధానం ద్వారా కరెంటు ఆదాతో పాటు మొక్కలకు అవసరమైన నీటిని అందించవచ్చునని తెలిపారు. ఉమ్మడి ఖమ్మంజి ల్లాలో పామాయిల్ సాగును అత్యధికంగా సాగు చేయించి రాష్ట్రంలోనే హబ్‌గా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. పామాయి ల్‌కు కనీస మద్దతు ధర రూ. 18 వే ల వరకు ఉండాలని తాము డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. కనీసం రూ. 15వేలు కల్పిస్తే గింజల ద్వారా ఆయిల్ తీసేది రైతులకు కలిపితే మరింత లాభం చేకూరుతుంద న్నారు. రైతులకు గిట్టుబాటు ధర రానప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పామాయిల్ సాగుకు సంబంధించి కంపెనీలు సొంత లాభంతో పని చేస్తే వాటి గుర్తింపు రద్దు చేస్తామన్నారు. పామాయిల్ సాగుకు సంబంధించి ఇతర దేశాలలో సాగు తీరుపై మండలానికి ఐదుగురు చొప్పున ప్రతి యేటా తీసుకెళ్లి వారికి అవగాహన కల్పించాలని కంపెనీలకు సూచించారు. గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మంజిల్లాను సస్యశ్యామలం చేయడమే తన రాజ కీయ లక్ష్యమని తాను ఏ ప్రభుత్వంలో ఉన్న రైతాంగం కోసమే పనిచే స్తానని తెలిపారు. పూజ్యులు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పామాయిల్ తొలి మొక్క నాటారన్నారు. బిజెపి ప్రభుత్వం ఇంపోర్టు డ్యూటీ తగ్గించడం వల్ల పామాయిల్ గెలల ధరలు తగ్గాయ న్నారు. మన దేశంలో పామాయిల్ దిగుమతుల విలువ ప్రతి ఏడాది లక్షల కోట్లకు చేరుతుందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం, కాలు వల తవ్వకాలలో భూములు కోల్పోతున్న రైతులకు నష్టం జరుగుతున్న ప్పటికి తప్పదన్నారు. ఇట్టి విషయంలో వారికి సముచితమైన పరిహారం అందించే విషయంలో తాను రైతుల పక్షానే ఉంటానన్నారు. శాస్త్రవేత్తలు రైతులకు పామాయిల్ సాగుకు సంబంధించి పలు అంశాలపై అవగా హన కల్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, సిపిఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శ న్‌రావు, సిపిఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, గుత్తా వెంకటేశ్వరరావు, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మీ నారాయణ, గోద్రెజ్ కంపెనీ ప్రతినిధి చావా వెంకటేశ్వరరావు, శాస్త్రవేత్త ప్రసాద్, కార్పొరే టర్లు మలీదు వెంకటేశ్వర్లు, మలీదు జగన్, మొక్కా శేఖర్ గౌడ్, సాధు రమేష్‌రెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు. తొలుత పామాయిల్ వ్యవ సాయ క్షేత్రానికి వచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మానుకొండ రాధాకిషోర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం వ్యవసాయ క్షేత్రంలో సాగు చేస్తున్న కూరగాయల పంటను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. పామాయిల్ తోటలో మంత్రి కలియ తిరిగారు.

# పోలింగ్ విధులను సమర్ధవంతంగా నిర్వర్తించాలి

## డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్







**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పోలింగ్ విధులను సమర్ధవంతంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల నియోజక వర్గ ఉప ఎన్నికను పురస్కరించుకుని ఆదివారం ఎస్ఆర్అండ్బిజిఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తనిఖీ చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ సిబ్బంది స్వీకరిస్తున్న పోలింగ్ మెటీరియల్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తి పోలింగ్ సామాగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఆదివారం రాత్రి పోలింగ్ కేంద్రాల్లోనే బస చేయాలని , సోమవారం నాటి పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పట్టభద్రుల ఉప ఎన్నికల పోలింగ్ జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఉదయం 7.30 గంటల కల్లా పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో జంబో బాక్సుల సీలింగ్ ప్రక్రియ చేపట్టాలన్నారు. జంబో బాక్స్ ఖాళీగా ఉన్నట్లు చూపించి అడ్రస్ ట్యాగ్ చేయాలని, బాక్స్ మూత పెట్టి రెండు తాళాలు వేసి స్టిక్కర్ వేయాలని ఆయన తెలిపారు. పోలింగ్ కేంద్రంలో 800 ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు ఉంటే రెండు ఓటింగ్ కంపాట్‌మెంట్లు ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. బాక్సుల సీలింగ్ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓటు సీక్రెసికి విఘాతం కలగకూడదని కలెక్టర్ సూచించారు. బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులతో ఎన్నికల నిర్వహణ జరుగుతున్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఓటరును ఫ్రీస్కింగ్ చేసి తనిఖీల పిదప అనుమతించాలన్నారు. జిల్లాలో 118 పోలింగ్ కేంద్రాలు 40 లోకేషన్లలో ఏర్పాటు చేశామన్నారు. 50,676 మంది పురుష, 33,199 మంది మహిళ, నలుగురు ఇతరులు మొత్తం 83,879 మంది పట్టభద్రులు తమ ఓటును వినియోగించుకోనున్నారని కలెక్టర్ తెలిపారు. రిజర్వుతో కలుపుకుని 129 బ్యాలెట్ బాక్సులు ఎన్నికలకు సిద్ధం చేసినట్లు, 142 మంది పివోలు, 142 మంది ఏపివోలు, 284 మంది ఓపివోలు పోలింగ్ విధులకు నియమించినట్లు తెలిపారు. 15 సెక్టార్‌లను ఏర్పాటు చేసి 15 మంది సెక్టార్ అధికారుల నియమాకం చేసినట్లు ఆయన తెలిపారు. పోలింగ్ పిదప ఎస్ఆర్అండ్బిజిఎన్ఆర్ డిగ్రీ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రానికి బ్యాలెట్ బాక్సులు వస్తాయని అక్కడి నుంచి లెక్కింపు కొరకు నల్గొండకు ఆర్టిసి డిజిటి వాహనంలో ఎస్కార్ట్ పోలీస్ బందోబస్తుతో చేరుకుంటాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, ఆర్డివోలు జి. గణేష్, ఎల్. రాజేందర్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ శ్రీలత, జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులు కె. శ్రీరామ్, మదన్‌గోపాల్, కలెక్టరేట్ ఏవో అరుణ, ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్నను గెలిపించండి

## సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్



**ప్రజాపక్షం/ఖమ్మం :** పట్టభద్రుల స్థానానికి సోమవారం జరిగే ఉప ఎన్నికల్లో సిపిఐ, సిపిఎం, టిజెఎస్ బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. బిజెపి ఉద్యోగ, నిరుద్యోగులను తన పదేళ్ల కాలంలో పట్టించుకోలేదని కార్పొరేట్ల సేవలోనే తరించిందన్నారు. ఉద్యోగ, ఉపాధి కల్పన రంగాలపై దృష్టి సారించ లేదని ప్రసాద్ తెలిపారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులను పూర్తిగా విస్మరించిందని ప్రభుత్వ ఉద్యోగులను సైతం పట్టించుకోలేదన్నారు. లీకులతోనే బిఆర్ఎస్ కాలం గడిచిపోయిందని ఇప్పుడు మరల ఆ రెండు పార్టీలకు ఓట్లు వేసినా ఫలితం లేదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార మల్లన్న తొలి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని ఆయన కోరారు.

# తీన్మార్ మల్లన్నను గెలిపించండి

## - సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఈనెల 27వ తేదీ జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిపిఐ సిపిఎం పార్టీ బలపరుస్తున్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలిపించాలని సిపిఐ జిల్లా కార్య దర్శి వర్గ సభ్యులు దండు ఆదినా రాయణ సత్తుపల్లి లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వామ పక్షాలు బలపరుస్తున్న మల్లన్న గెలుపు నిరుద్యోగులకు ఉపాధి అవ కాశాలు కల్పన కోసం ఉద్యోగాల సౌకర్యాలు కల్పన కోసం ఉద్యోగులకు సౌకర్యాలు కల్పన కోసం ప్రజా సమస్యలు పరిష్కారం చేయటంలో ప్రజా గొంతుకలాగా మల్లన్న పనిచేస్తారని కాబట్టి తీన్మార్ మల్లన్న గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఎస్కే.హమీద్, వి. రమేష్ , మహిళా సమైక్య నాయకులు రంజాన్ బి తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కు సంబంధించి అధికారులు పూర్తి చేసినట్లు జిల్లా పరిషత్ సీఈవో వినోద్ అన్నారు. మండల కేంద్రం లోని ప్రభుత్వ హైస్కూల్ లో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. సిబ్బంది కి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో సరిపడ సిబ్బంది ని ఏర్పాటు చేశా మని అన్నారు. కనీస సౌకర్యాలు కూడ కల్పించినట్లు తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కు ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివ, నేలకొండపల్లి మేజర్ పంచాయతీ కార్యదర్శి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఉచిత హోమియో మందుల పంపిణీ

## ప్రారంభించిన ఐజెయు నాయకులు రాంనారాయణ



**ప్రజాపక్షం/ఖమ్మం :** జర్నలిస్టులకు ఉచిత హోమియో మందుల పంపిణీ కార్యక్రమాన్ని టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రాంనారాయణ ప్రారంభించారు. ఆదివారం ప్రముఖ హోమియో వైద్యులు పరికిపల్ల అశోక్ ఆధ్వర్యంలో హోమియో మందుల పంపిణీ జరిగింది. వేసవిలో వడదెబ్బ నుంచి రక్షించుకునేందుకు ఈ హోమియో మందులు ఉపయోగపడతాయని వైద్యులు అశోక్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. రాంనారాయణ మాట్లాడుతూ వైద్య విధానంలో హోమియో వైద్యం శ్రేష్టమైందని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. తీవ్రమైన అనారోగ్యం కలిగిన మినహా మిగిలిన సమయాల్లో హోమియో మందులు వాడడం మంచిదని దీని వల్ల ఇతర ఇబ్బందులు తలెత్తవ న్నారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు మైసా పాపారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు నర్వనేని వెంకట్రావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు, నగర కార్యదర్శి చెరుకుపల్లి శ్రీనివాసరావు, ప్రెస్‌క్లబ్ కోశాధికారి నామ పురుషోత్తం, నాయకులు పసుపులేటి సత్యనారా యణ, మేడి రమేష్, కళ్యాణ్, మధులత పాల్గొన్నారు.

# బౌద్ధక్షేత్రాల పట్ల ప్రభుత్వాలకు నిర్లక్ష్యం తగదు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** బౌద్ధక్షేత్రాల పట్ల ప్రభుత్వాలకు నిర్లక్ష్యం తగదని బౌద్ధబిక్షువు సద్ధా రఖ్కితా అన్నారు. మండల కేంద్రంలోని బౌద్ధక్షేత్రం ను ఆదివారం సందర్శించారు. బౌద్ధ పూర్ణిమ వారోత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...బౌద్ధక్షేత్రాల పట్ల కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయటం మంచిది కాదని అన్నారు. అభివృద్ధికి నోచుకోకుండా ఆలనా, పాలన లేకుండా బౌద్ధక్షేత్రాలు ఉన్నాయని అన్నారు. నేలకొండపల్లి బౌద్ధక్షేత్రం వద్ద కనీసం తాగటాని మంచినీరు కూడ లేని పరిస్థితి ఉండటం బాధకరమని పేర్కొన్నారు. బౌద్ధక్షేత్రాలను ఆదాయ వనరులు గా చూస్తున్నారని అన్నారు. ఆధ్మాత్మిక పర్యాటక కేంద్రాలు గా అభివృద్ధి చేయాలని కోరారు. దాని వలన పర్యాట కులు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అన్నారు. పూర్వీకులు అందించిన సంపద ను స్తానికులు సంరక్షించుకోవాలని అన్నారు. బౌద్ధక్షేత్రం అభివృద్ధి లో బౌద్ధభిక్షువులను భాగస్వా మ్యులను చేయాలని అన్నారు. త్వరలోనే నేలకొండపల్లి బౌద్ధక్షేత్రం వద్ద ద్యాన యోగ కేంద్రం ను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న బౌద్ధక్షేత్రాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దుడ్డెల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


# జూన్ ఒకటి నుంచి వేతన సవరణ అమలు చేయండి

## ఆర్టిసి ఎంప్లాయీస్ యూనియన్



**ప్రజాపక్షం/ఖమ్మం :** జూన్ ఒకటి వేతనాలతో పాటు సవరించిన వేత నాలను, అలవెన్సులను చెల్లించాలని ఆర్టిసి ఎంప్లాయీస్ యూనియన్ రీజినల్ కార్యదర్శి పిల్లి రమేష్ డిమాండ్ చేశారు. 2021కు సంబంధిం చిన వేతన సవరణ కూడా చేయాలని ఆర్టిసి యాజమాన్యం తక్షణం యూనియన్లను పిలిచి వేతన సవరణలపై చర్చించాలని కోరారు. ఆర్టిసి ఎంప్లాయీస్ యూనియన్ ఖమ్మం డిపో సమావేశం ఆదివారం డిపో అధ్యక్షులు దేశబోయిన జగన్నాథం అధ్యక్షతన యూనియన్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పిల్లి రమేష్ మాట్లాడుతూ 2017 వేతన సవరణ 21 శాతం ఫిట్‌మెంట్‌తో యాజమాన్యం ఏకపక్షంగా ప్రకటించిందని ఆయన తెలిపారు. యూని యన్ల ప్రమేయం లేకుండా ఆర్టిసి చరిత్రలో వేతన సవరణ చేసినటు వంటి యాజమాన్యం అలవెన్సుల గురించి పట్టించుకోకపోవడం దుర దృష్టకరమన్నారు. ఆర్టిసి ఎంప్లాయీస్ యూనియన్ ఇప్పటికే ఎండికి వినతి పత్రం అందజేసిన విషయాన్ని రమేష్ గుర్తు చేశారు. టిఎస్ ఆర్టి సిని ప్రభుత్వంలో విలీనం చేస్తూ ఉద్యోగుల జీతభత్యాల సవరణ చేయా లని జూన్ రెండున ఆర్టిసి విలీనానికి సంబంధించి ప్రకటన చేయాలని ప్రకటన చేయని పక్షంలో కార్మికులను సమీకరించి హక్కుల సాధన, ఇతర ఆర్థిక అంశాలకు సంబంధించి ఆందోళన చేపడతామని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో డిపో కార్యదర్శి బేతంపూడి బుచ్చిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దిపాక వెంకటేశ్వర్లు, కోశాధికారి దామాల నాజర్, నాయకులు అనిత, ఆదాం, హరినాథబాబు, ఎం. సుధీర్ గాంధీ, అరుణమ్మ, ఆదిలక్ష్మి , సుశీల, సుల్తానా, అన్వర్, సునీల్‌కృష్ణ, శోభన్‌బాబు, వెంకటేశ్వర్లు, సంగయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

## బీజేపీకి ఓటుతో మీ భవిష్యత్



ప్రజాపక్షం/నేలకొండపల్లి : ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ కి ఓటు వేసి మీ భవిష్యత్ ను మార్చుకోవాలని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు....యువతను, నిరుద్యోగులను, ఉద్యోగులను బీఆర్ఎస్, కాంగ్రెస్ మోసం చేశారని అన్నారు. బీజేపీ ని గెలిపిస్తే మండలి లో మీ వాణి ని వినిపించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. మేధావులు ఆలోచించి ఓట్లు వేయాలని కోరారు. ఎమ్మెల్సీ గా గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గెలవటం ఖాయమని పేర్కోన్నారు. భారీ మెజార్టీ కోసం తాము పని చేస్తున్నట్లు తెలిపారు. పదేళ్ల పాటు బీఆర్ఎస్ యువత, నిరుద్యోగులకు చేసింది శూన్యమని అన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడ అదే పరిస్థితి నెలకొందని అన్నారు. ప్రజా సమస్యల పై మండలి లో పోరాడే వ్యక్తి బీజేపీ అభ్యర్థి అన్నారు. పార్టీ నాయకులు గోవిందరావు, నాగేశ్వరరావు, కృష్ణారావు, సతీష్, గిరి పాల్గొన్నారు.

## పలువురికి పరామర్శ



ప్రజాపక్షం/ములకలపల్లి:ములకలపల్లి మండలంలోని కాంగరెస్ పార్టీ మండల అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్ ఆధ్వర్యంలో పుష్పాలంకరణ వేడుకకు, పలువురుని పరామర్శకు ఎంఎల్ఏ జారే ఆదినారాయణ హాజరయ్యారు. నగరికంటి వారి ఓణీల వేడుకకు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. అదే విధంగా ములకలపల్లి ప్రధాన సెంటర్‌లో హైస్కూల్ బజార్‌లో కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ హాస్పిటల్‌లో ట్రీట్మెంట్ చేపించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కోరం రాంబాబుని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీసి మెరుగైన వైద్యం అందంఇచడానికి తప్పక సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అనంతరం భగత్‌సింగ్ నగర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న నీలం తిరుపతమ్మని పరామర్శించి ప్రస్తుత పరిస్థితి గురించి తెలుసుకొని ఇంకా మెరుగైన వైద్యం కోసం తన ద్వారా అందిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టుల చర్యలతో నష్టపోతున్న సామాన్య ప్రజలు : ఎస్పి

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : మావోయిస్టుల చర్యల వల్ల సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని ఎస్‌పి రోహిత్ రాజ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మావోయిస్టు మిలీషియా సభ్యులు అమర్చిన బూబిట్రాప్స్ వల్ల ఇద్దరు ఆదివాసీ మహిళలు రెండు కాళ్లకు తీవ్ర గాయాలు అయయ్యాని, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారు ఎట్టకేలకు బ్రతికారని చెప్పారు. మావోల ఆటవిక చర్యల వల్ల ఆదివాసీ ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు నష్టం వాటిల్లుతోందని ఆయన అన్నారు. పూసుగుప్ప, ఉంజుపల్లి గ్రామాల్లో శనివారం రాత్రి మావోయిస్టులు రహదారికి అడ్డంగా చెట్లను నరికి పడేసి ఆదివాసీల రాకపోకలకు అంతరాయం కలిగించారని, ప్రభుత్వాలు ఆదివాసీలకు విద్య,వైద్యంతో పాటు రహదారి సదుపాయాలు కల్పిస్తుంటే మావోయిస్టులు అడ్డు తగులుతున్నారని చెప్పారు. సామాన్య ప్రజలకు అనేక ఇబ్బందులు కలుగుతున్నాయని, మావోయిస్టు పార్టీ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఆపరేషన్ చేయూతలో భాగంగా ఇప్పటి వరకు జిల్లాలో 15 మంది మావోయిస్టులు లొంగిపోయారని, వారికి ప్రభుత్వంతరుపున పునరావాసం కల్పించడంతో పాటు ప్రతిఫలాలు అందించడం జరుగుతుందని అన్నారు. నిషేదిత మావోయిస్టు పార్టీని వీడి జన జీవన స్రవంతిలో కలవాలని వారికి అన్ని విధాలుగా ప్రభుత్వం చేయూతనందిస్తుందని తెలిపారు.

## పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది, బాక్సులు




ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలకు 15 మంది పోలీసులు, పోలింగ్ సిబ్బంది 20 మంది తోపాటు 3 709 మంది పట్టభద్రులు తమ యొక్క ఓటును వినియోగించు కోనున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ సమయం ఉందని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండగా మద్యం దుకాణాలు సోమవారం సాయంత్రం వరకు బంద్ చేసి ఉంటాయని ఎస్సై షాకీర్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలందరూ సహకరించాలని కోరారు. సెక్టర్ అధికారి పులి సాంబశివుడు, నోడల్ అధికారి చంద్రశేఖర్, పర్యవేక్షకులు బాబ్జి ప్రసాద్ ఎస్సై షాకీర్ లు ఎన్నికలను పర్యవేక్షించనున్నారు.

# నేడే పట్టభద్రుల ఉప ఎన్నిక

- మొత్తం 40106 మంది ఓటర్లు
- భరిలో 52 మంది అభ్యర్థులు
- ఎన్నికల సమాగ్రి పంపిణీ



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : వరంగల్,ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఉప ఎన్నిక నేడు జరగనుంది. ఇందు కోసం జిల్లా ఎన్నికల అధికారి పర్యవేక్షణలో ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేయగా, సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 8 గం. నుండి సాయంత్రం 4 గం. వరకు పోలింగ్ జరగనుంది. ఎంఎల్‌సి నియోజకవర్గ పరిధిలో మొత్తం 40106 మంది ఓటర్లు ఉండగా, అందులో 22590 మంది పురుషులు, 17516 మంది మహిళలు ఉన్నారు. ఇందు కోసం 55 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు.

**బరిలో 52 మంది అభ్యర్థులు...**

పట్టభద్రుల ఉప ఎన్నిక సందర్భంగా మొత్తం 52 మంది అభ్యర్థులు భరిలో ఉన్నారు. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన తీన్మార్ మల్లన్న, బిజెపి బలపరిచిన గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, బిఆర్ఎస్ బలపరిచిన ఏనుగుల రాకేష్ రెడ్డిల మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఉప ఎన్నిక సందర్భంగా మొత్తం 69 మంది నామినేషన్లు సమర్పించగా, అందులో 6 నామినేషన్లు తిరస్కరణకు గురికాగా, 63 మంది పోటీలో ఉన్నారు.



11 మంది ఉపసంహరణ చేసుకోవడంతో 52 మంది భరిలో నిలిచారు.

**ఎన్నికల సామాగ్రి పంపిణీ...**

ఎంఎల్‌సి ఉప ఎన్నికలో భాగంగా ఆదివారం కొత్తగూడెంలోని రామచంద్ర డిగ్రీ కళాశాల్లో సిబ్బందికి ఎన్నిక సామాగ్రిని పంపిణీ చేయగా, వారు తమతమ పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి డా.ప్రియాంక ఆలా పంపిణీ కేంద్రాన్ని తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

# పెట్రోల్ బంకులో లొల్లి లొల్లి..!

- పెట్రోల్ తక్కువ పోశారంటూ వినియోగదారుని ఆందోళన
- కేసు నమోదు చేసిన తూనికలు కొలతల అధికారి

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : పట్టణంలోని పోస్టాఫిస్ సెంటర్లో గల ఓ పెట్రోల్ బంక్‌లో తనకు పెట్రోల్ తక్కువగా పోశారంటా ఓ వినియోగదారుడు ఆందోళనకు దిగాడు. ఆదివారం ఓ వ్యక్తి పెట్రోల్ బంక్‌లు రెండు లీటర్ల పెట్రోల్ పోయించుకున్నాడు. పెట్రోల్ పోసిన విధానాన్ని చూసి అనుమానించిన వినియోగదారుడు తక్కువగా పోశావంటూ నిలదీయడంతో ఇరు వర్గాల మధ్య గొడవ ప్రారంభమైంది. తాను సరిగానే పెట్రోల్ కొట్టానంటూ పెట్రోల్ బంక్‌లో వ్యక్తి చెప్పడంతో పాటు అవసరమైతే లీటర్ సీసాల్లో కొలుచుకో, నీ చేతనైంది చేసుకో అంటూ గట్టిగా సమాధానం ఇచ్చాడు. దీంతో ఆగ్రహానికి లోనైన వినియోగదారుడు వెంటనే రెండు లీటర్ బాటిళ్లు తెప్పించి బండి ట్యాంకులో ఉన్న పెట్రోల్‌ను పట్టి చూడగా, కేవలం లీటరన్నర వచ్చిందని తెలిపాడు. పెట్రోల్ బంకుల్లో మోసాలు చేయడమే కాకుండా అడిగిన వారిపై ఇక్కడి వారు మాటల దాడి చేస్తున్నారని మండిపడ్డారు. వినియోదారులను మోసం చేసే ఇలాంటి బంకులపై కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.




**కేసు నమోదు...**

పెట్రోల్ బంక్‌లో చోటు చేసుకున్న లొల్లితో రంగంలోనికి దిగిన తూనికలు, కొలతల అధికారి మనోహర్ బంక్‌పై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్ కొట్టే సమయంలో జీరో రీడింగ్ చేయకుండా వినియోగదారులనికి పెట్రోల్ పోసినట్లు తేలిందని, దీంతో నిబంధనలుకు విరుద్ధంగా నడుచుకుంటున్నట్లు తేల్చి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

# బిఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి గెలుపునకు కృషి

వైరా మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్

ప్రజాపక్షం/కారేపల్లి: ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభ్రుదల ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి గెలుపునకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని వైరా నియోజకవర్గ బిఆరెస్ పార్టీ ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ అన్నారు. ఆదివారం కారేపల్లి బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ నెల27న జరిగే ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బిఆర్శ్రీస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. విద్యావంతుడైన రాకేష్‌రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అన్నారు. అనంతరం కారేపల్లి కేంద్రంలో ఆదర్ల పేరయ్య దశదిన కార్యక్రమంలో హాజరై నివాళులు అర్పించారు. హమాలీ సంఘ నాయకుడు పెద్దమ్మ బాబు ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. చీమల వారి సత్యం భార్య ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి చిత్రపటాన్ని నమస్కరించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి మండలం జెడ్పిటిసి వాంకుడోతు జగన్‌నాయక్, హన్మకొండ రమేష్, తాతా వెంకన్న, జడల వెంకటేశ్వర్లు, అడపా పుల్లారావు, డొంకెన రవీందర్, ఇస్లావత్ బన్సీలాల్, షేక్ గౌసుద్దీన్, బుడగం ప్రభాకర్, పేర్ని వెంకటేశ్వర్లు, పెద్దబోయిన సురేష్, అజ్మీర్ నరేష్,బర్మావత్ కోటి, గడ్డం వెంకటేశ్వర్లు, దారావత్ వికాస్, బానోతు రాజేష్, నాగరాజు, రామారావు, తోటమాల సాయి,బొల్లి అప్పారావు, మాత్రు కోటేశ్వరరావు, భూక్యా మధు, పొదుగు హరీష్, మాలోతు స్వామి, రవి, ఖలీల్, వాంకుడోత్ బన్సీలాల్, సక్రు, సామేలు, రమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# నకిలీ విత్తనాలపై జాగ్రత్తగా ఉండండి







ప్రజాపక్షం/బూర్గంపాడు: నకిలీ విత్తనాలపై జాగ్రత్తగా ఉండాలని వ్యవసాయ శాఖ ఏడిఏ తాతారావు, మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్ శంకర్‌లు అన్నారు. సోంపల్లి రెవిన్యూ పరిధిలోని రైతులకు వివిధ అంశాలపై ఆదివారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఏడిఏ తాతారావు పాల్గొని మాట్లాడుతూ రైతులందరూ నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాలలో ఇంటింటికి తిరిగి ఎవరైనా గుడ్డ సంచులలో కానీ, నకిలీ లేబుల్‌తో ఉన్న ప్యాకెట్లలో కానీ విత్తనాలు అమ్మినట్లయితే ఎట్టి పరిస్థితులోనూ అటువంటి వారి వద్ద విత్తనాలు తీసుకోవద్దని, లైసెన్స్ కలిగిన అధికృత డీలర్ నుంచి మాత్రమే విత్తనాలను తీసుకోవాలని సూచించారు. పంట కాలం పూర్తయ్యే వరకు బిల్లును జాగ్రత్తపరచుకోవాలని తెలిపారు. అనంతరం మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్ శంకర్ మాట్లాడుతూ గ్రామాలలో ఎవరైనా అనుమతి లేకుండా విత్తనాలు అమ్ముతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే తమకు తెలియజేయాలని కోరారు. వేసవిలో లోతు దుక్కులు చేయడం వలన భూమి లోపల పొరల్లో ఉన్న పురుగుల యొక్క గుడ్లు లార్వాలను నశింపచేయొచ్చని తెలిపారు. అదే విధంగా జనుము, జీలుగా, పిల్లి పెసర వంటి పచ్చిరొట్టపైర్ల వల్ల కలిగే ఉపయోగాలను రైతులకు వివరించారు. మట్టి పరీక్ష నమూనాలను ఏ విధంగా సేకరించాలని, మట్టి పరీక్ష ఫలితాల విశ్లేషణ గురించి తెలియజేశారు. అదే విధంగా వరి పంట అవశేషాలను తగలబెట్టడం ద్వారా జరిగే అనర్థాలను గురించి రైతులకు వివరించారు. అనంతరం మండలంలోని లక్ష్మీ పురం, సారపాక, బూర్గంపాడులో గల విత్తనాల షాప్‌లను తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారితో మాట్లాడుతూ రైతులకు విత్తనాలు, ఎరువులు అమ్మినట్లయితే వారికి బిల్లులను ఇవ్వాలని తెలిపారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రసాద్, ఇన్‌చార్జ్ పంచాయితీ కార్యదర్శి విజయ్, రైతులు గాదె నర్సిరెడ్డి, దనుగూరి నాగేశ్వరరావు, బోరెం శ్రీనివాసరావు, పెంకే దారుగ, చలకంటి సత్యం, పండగ చిట్టెయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కారుణ్య విద్యార్థిని మరణంపై న్యాయ విచారణ జరిపించాలి



ప్రజాపక్షం/బూర్గంపాడు: భద్రాచలంలో డాక్టర్ కాంతారావు నడుపుతున్న మారుతీ పారామెడికల్ కాలేజీలో బిఎస్‌సి నర్సింగ్ చదువుతున్న పగిడిపల్లి కారుణ్య ఎలా చనిపోయిందో జిల్లా కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి, జిల్లా పోలీస్ అధికారి విచారణ జరపాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు డి పున్నం చంద్ కోరారు. కాలేజీ యాజమాన్యం సీసీ ఫుటేజ్‌ని డిలీట్ చేయడం అనుమానస్పందంగా మారిందని గురువారం రాత్రి 8గంటలకు భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో చనిపోయినట్టు నిర్ధారించారనీ శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు కాలేజీ యాజమాన్యం సెటిల్‌మెంట్ చేశారనీ, పారామెడికల్ మారుతీ కాలేజ్‌కి దాని యాజమాన్యానికి ఎటువంటి సంబంధాలేదని వాళ్ల తల్లిదండ్రులు ప్రెస్ నోట్ రిలీజ్ చేశారనీ దీనిపై జిల్లా కలెక్టర్, ఎస్‌పి, భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి విచారణ జరిపి తగు న్యాయం జరిపించాలని ఒక డిమాండ్ అయితే, మా డిమాండ్ విద్యార్థిని మరణించిన స్థలంలోకి ఇన్వెస్టిగేషన్ చేసి వాళ్ళ మిత్ర బృందాన్ని కానీ తన ఉన్న రూమ్‌ని కానీ తను క్రింద పడిన స్థలాన్ని కానీ జరుగుతున్న అన్నింటిని గమనించి సరైన మార్గంలో ఎంక్వరీ చేసి నిజ నిర్ధారణ చేసి ఆ నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు ఇక ముందు పునరుద్ధరణ జరగకుండా ఆ కాలేజ్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలనీ ఈ ఘటనలో ఎవరైనా ఎంతవారైనా కఠినంగా శిక్షించాలని, నియమ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న మారుతీ నర్సింగ్ కాలేజ్‌పై ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్‌కు కంప్లైట్ లెటర్ సిఫారస్ చెయ్యాలని అన్నారు. అమ్మాయి తల్లిదండ్రులు కొట్టుకొని విడిపోయారని, మేనమామ ఆ అనాధను కష్టపడి చదివించారనీ అమ్మనాన్న లేకపోవడంతో భయంతో పెరిగిందన్నీ ఆ అమ్మామి చనిపోయిన ప్లేస్‌కు వెళ్లకుండా ఆత్మహత్య అని సెటిల్‌మెంట్ చేశారని ఆరోపించారు. దీన్ని తీవ్రంగా మా పార్టీ జిల్లఆకమిటీ ఖండిస్తుందని కారుణ్యకు న్యాయం జరిగే దాకా ఉద్యమాలు, పోరాటాలు జరుగుతాయన్ని తెలిపారు.

## కారు..ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు మృతి



ప్రజాపక్షం/బూర్గంపాడు: బంధువుల ఇంట్లో కర్మలకు వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు ప్రమాదంలో ఒకరు మృత్యుఒడికి చేరగా మరొకరి పరిస్థితి విషయంగా మారిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని పినపాక పట్టీనగర్ గ్రామంలోని కిన్నెరసాని బ్రిడ్జి వద్ద ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాల్వంచ మండలం గుడిపాడుకు చెందిన శెట్టిపల్లి నరసింహారావు(18) తన స్నేహితుడు కణితి హర్షవర్ధన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై మండలంలోని కృష్ణసాగర్‌లో బంధువుల ఇంటి వద్ద జరిగిన కర్మలకు హాజరయ్యారు. కర్మల అనంతరం తిరిగి ద్విచక్రవాహనంపై గుడిపాడు స్వగ్రామానికి వెళుతుండగా పినపాక పట్టీనగర్‌లో కిన్నెరసాని బ్రిడ్జికి చేరుకోగానే భద్రాచలం వైపు నుంచి పాల్వంచ వెళ్లే కారు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న శెట్టిపల్లి నర్సింహారావు అక్కడిక్కడే దుర్మరణం పాలవ్వగా స్నేహితుడు హర్షవర్ధన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈసంఘటన సమాచారం అందుకున్న బూర్గంపాడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. తీవ్రంగా గాయపడిన హర్షవర్ధన్‌ను స్థానికుల సహాయంతో పాల్వంచ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం అక్కడ నుంచి కొత్తగూడెం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





## నేటి పోలింగ్‌కు సర్వం సిద్ధం

ప్రజాపక్షం/బూర్గంపాడు: ఎంఎల్‌సి ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపిడివో జములారెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌కేంద్రంలో ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 2078 మంది ఓటర్లు శాసన మండలి ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారన్నారు. పోలింగ్ కేంద్రానికి ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఓటర్లు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. ఓటరు స్లిప్పు ఉన్నా లేకున్నా తమ ఓటు హక్కును ఏదైనా గుర్తింపు కార్డు చూపించి వినియోగించుకోవచ్చన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ ముత్తయ్య, పంచాయితీ కార్యదర్శి సమ్మయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## హాజరు శాతాన్ని పెంచడమే తమ లక్ష్యం



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థినీ, విద్యార్థులకు మనబడి కార్యక్రమం ద్వారా హాజరు శాతాన్ని పెంచడమే తమ ముఖ్య లక్ష్యమని, మండల కేంద్రంలోని శాంతిని విద్యనికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, డిఎస్ఎస్ సిస్టర్ మహిత అన్నారు. ఈసందర్భంగా ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రాథమిక విద్యను ప్రథమంగా పేద పిల్లలకు అతి తక్కువ ఫీజులతో, పాఠశాలలోని మౌలిక సౌకర్యాలతో, విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తూ, నీటి సౌకర్యం, ఆటల పోటీల క్రీడా ప్రాంగణం, బహుళ అంతస్తుల భవనాలలోని, పిఈటి ఉపాధ్యాయునితో సహా, తరగతులన్నింటికీ, ఆంగ్లంతో బోధనలను అధికంగా బోధించేందుకు, మెరిట్ బిఈడీ విద్యను పూర్తి చేసి, ఎంతో అనుభవంగా కలిగి, విద్యావంతులైన ఉపాధ్యాయ సిబ్బందితో విద్యను బోధించడం జరుగుతుందని తెలిపారు. గిరిజన ప్రాంతంలో వ్యవసాయ కూలీలు, నిరుపేదల కుటుంబాల పిల్లలను, ప్రాథమిక స్థాయిలోనే ఆంగ్ల భాష పట్ల పట్టుత్వంతో మంచి విద్యార్థులుగా తీర్చిదిద్దుతూ పై చదువులకు మెరుగైన బోధనలు వారి జీవితంలో ఎంతో దోహదపడతుందని వారు సూచించారు. అనంతరం పునీత పౌల్ పేతురు ఆర్సిఎం చర్చి విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ కూరపాటి యాకోబు అధ్యక్షతన పిల్లల తల్లిదండ్రులతో పాటుగా క్రైస్తవ సంఘస్తులు, సంఘ నాయకుల నడుమ, సిస్టర్ మహితను పట్టుశాలతో సత్కరించి, సన్మానించడం జరిగిందన్నారు. ఫాదర్ యాకోబు మాట్లాడుతూ ప్రిన్సిపాల్, సిస్టర్ మహితకు విద్య బోధనల పట్ల గుజరాత్, కేరళ, కర్నూల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లోని పాఠశాలల్లో విద్య బోధనలను అందించిన అనుభవం ఎంతో ఉందని వారు గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో డిఎస్ఎస్ సిస్టర్, సుపీరియర్ మేరీ శాంతల్, దామరీస్, ఉమ్మడి ఖమ్మం జిల్లా దయాసిస్ జ్యోతిర్మయి, యానిమేటర్ పరమ ప్రభాకర్, సంఘ నాయకులు కర్కపల్లి నాగేశ్వరరావు, రామ్మూర్తి, రాంబాబు, చిన్నచారి, సులోచన, రుక్మిణి, రాజీ, మంగా, ప్రశాంతి, విజయలక్ష్మి , లలిత, కళావతి, యూత్ సభ్యులు నవీన్, జోజి, శృచిల్, ఉదయ్ జీవన్, అశ్విత పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో గేదె మృతి




ప్రజాపక్షం/బూర్గంపాడు: మండలంలోని సోంపల్లి గ్రామానికి చెందిన నడిపింటి రమేష్ అనే రైతుకు చెందిన గేదె విద్యుత్ ఘాతంతో మృతి చెందింది. నిరుపేద కుటుంబానికి చెందిన రమేష్ గేదె మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. గ్రామానికి సమీపంలో మేతకు శనివారం ఉదయం వెళ్లిన గేదె ఇంటింటికి తిరిగి రాకపోడంతో గ్రామంలో వెతికాడు. తారస పడకపోవడంతో మరుసటి రోజు ఆదివారం వెతుకుతుండగా ఓ రైతు పొలం సమీపంలోని ట్రాన్స్ఫార్మర్ కింద విద్యుత్ ఘాతంతో మృతి చెందింది. సుమారు గేదె విలువ రూ 60వేలు ఉంటుందని రైతు తెలుపుతున్నారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. గేదె మృతి విషయంపై విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించారు.

## విద్యుత్ షాక్‌తో మూడు పాడి గేదెలు మృతి



ప్రజాపక్షం/చంద్రుగొండ: విద్యుత్ షాక్‌తో మూడు పాడిగేదేలు మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై వివరాలు ఇలా ఉన్నాయి. తిప్పనపల్లి గ్రామ పంచాయితీలో గల మహ్మద్‌నగర్ గ్రామానికి చెందిన షేక్ ఖైరుల్లాకుచెందిన రెండు గేదేలు, సయ్యద్ కరీంకు చెందిన మరో గేదే కలిసి ఆదివారం ఉదయం మేత కోసం పొలాల్లోకి వెళ్లిన్నాయి. మేత మేసే క్రమంలో ప్రమాదవశాత్తు తెగిపడి ఉన్న విద్యుత్ వైర్లు తగిలి అక్కడిక్కడే మూడు పాడి గేదేలు మృతి చెందాయి. వీటి విలువ రూ 2లక్షల వరకు ఉంటుందని బాధిత రైతులు ఖైరుల్లా, కరీంలు తెలిపారు. పాడి గేదేలు మృతి చెందిన రైతులను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## నేటి పోలింగ్‌కు సర్వం సిద్ధం



ప్రజాపక్షం/చంద్రుగొండ: ఎంఎల్‌సి ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపిడివో అశోక్ తెలిపారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌కేంద్రంలో ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 783 మంది ఓటర్లు శాసన మండలి ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారన్నారు. పోలింగ్ కేంద్రానికి ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఓటర్లు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. ఓటరు స్లిప్పు ఉన్నా లేకున్నా తమ ఓటు హక్కును ఏదైనా గుర్తింపు కార్డు చూపించి వినియోగించుకోవచ్చన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ ప్రసన్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల లెక్కింపులో అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా ఎన్నికల అధికారి విపి గౌతమ్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎన్నికల ప్రక్రియలో ఓట్ల లెక్కింపు అత్యంత కీలకమని ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియపై నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో లెక్కింపు సిబ్బందికి ఆదివారం ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి కలెక్టర్ విపి గౌతమ్ హాజరై విధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ నాలుగున జరిగే లోక్‌సభ సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు. ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లులోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఖమ్మం లోక్‌సభ సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఖమ్మం లోక్‌సభ నియోజక వర్గ పరిధిలోని ఓట్ల లెక్కింపుకు ఎనిమిది హాళ్లు సిద్ధం చేసినట్లు ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఒక హాల్ చొప్పున ఏడు హాళ్లను , పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కొరకు ఒక హాల్ ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో హాల్‌లో 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశామని, ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్‌లో 355 పోలింగ్ కేంద్రాలు ఉన్నందున 18 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. అధికారులు, సిబ్బంది సరైన అవగాహనతో సమగ్ర కార్యాచరణతో ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించాలన్నారు. లెక్కింపు ప్రతి దశలోను అప్రమత్తంగా ఉండాలన్నారు. కంట్రోల్ యూనిట్ ట్యాగ్‌లు పరిశీలించుకోవాలని ఫారం 17 సిలో ఓట్లు, కంట్రోల్ యూనిట్‌లో ఓట్లను సరి చూసుకోవాలన్నారు. కంట్రోల్ యూనిట్లలో టోటల్, రిజల్ట్ బటన్‌లు మాత్రమే వాడాలని కంట్రోల్ యూనిట్లలో మెమరి డిలిట్ చేయడానికి వీలు లేదని కలెక్టర్ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్, ఈవిఎం ఓట్ల లెక్కింపుపై కలెక్టర్ వివరించారు. వివిధ దశలలో ఎదురయ్యే సమస్యలు వాటిని పరిష్కరించే విధానాన్ని ఆయన వివరించారు. అధికారులు, సిబ్బంది నిర్వర్తించాల్సిన విధులపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపులో ఇంచార్జిల పాత్ర కీలకమన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లు, ఈవిఎం ఓట్లు లెక్కించేవిధానం, టేబుళ్ల ఏర్పాటు, చెల్లని ఓట్లు, చెల్లినవి గుర్తించడం వాటిని వేరుచేయడం, ఫలితాల నివేదిక సిద్ధం చేయడం, బోర్డుపై వెల్లడించడం అవసరమైన పత్రాలను పూర్తి చేయడం తిరిగి ఈవిఎంలను సీల్ చేసి స్ట్రాంగ్ రూములకు తరలించడం తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, శిక్షణ నోడల్ అధికారి కె. శ్రీరామ్, సహాయ శిక్షణ నోడల్ అధికారి మదన్ గోపాల్, లెక్కింపు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సాధారణ బోగీల కోసం ఉధృతమవుతున్న ఆందోళన



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఎక్స్‌ప్రెస్ రైళ్లలో సాధారణ భోగీల సంఖ్య పెంపుదల కోసం ఆందోళన రోజు రోజుకు ఉధృతమవుతుంది. ఇప్పటి వరకు రైల్వే అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇవ్వ డంతో సరిపెట్టిన వారు అవసరమైతే ఆందోళనకు సిద్ధం కావాలని పిలు పునిస్తున్నారు. భారతదేశంలో రోడ్డు మార్గం తర్వాత అతి పెద్ద రవాణా వ్యవస్థగా రైల్వేలు ఉన్నాయి. రైల్వేల విస్తరణలో భాగంగా 50 ఏళ్ల నాడు ప్రతి ఎక్స్‌ప్రెస్ రైలుకు రెండు మాత్రమే సాధారణ భోగీలు ఇవ్వా లని నిర్ణయించారు. జనాభా పెరుగుదలతో పాటు ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగిన తర్వాత సాధారణ భోగీల సంఖ్యను పెంచడం లేదు. ఆర్థిక స్థోమత లేని పేద, మధ్యతరగతి వారికి రైలులోసాధాణ భోగీలలో ఎక్కడం ఇప్పుడు గగనమవుతుంది. కిక్కిరిసిపోయి కాలు పెట్టేందుకు కూడా సందు ఉండడం లేదు. ప్రతి రైలుకు ఐదు నుంచి ఆరు సాధారణ భోగీలు ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో ఉన్న డిమాండ్‌ను పాలకులు పెడచెవిన పెడుతున్నారు. భారతదేశ జనాభాలో భారత రైల్వేలు 60 కోట్ల మందిని ప్రతి రోజు తమ తమ గమ్య స్థానా లకు చేరుస్తున్నట్లు ఒక అంచనా. దీనికి అనుగుణంగా పెరిగిన ప్రయా ణికులను దృష్టిలో ఉంచుకుని సాధారణ భోగీలను ఏర్పాటు చేయాల్సి ఉంది.

**పోస్టు కార్డు ఉద్యమం...**

వివిధ ప్రజా సంఘాలు రైల్వేలో సాధారణ భోగీల పెంపు కోసం ఆందో ళన నిర్వహిస్తున్నాయి. ఇటీవల సిపిఐ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రైల్వే అధికారులకు భోగీల పెంపు కోరుతూ వినతి పత్రం సమర్పించారు. డాక్టర్ పరికపల్ల అశోక్ సాధారణ భోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్‌గా భోగీల సాధన కోసం వివిధ రూపాలలో ఆందోళనను చేపడుతున్నారు. ఇప్పుడు కోటి ఉత్తరాలను ప్రధాన మంత్రికి అందించాలని కార్యాచరణ తీసుకుని అందుకు అనుగుణంగా ముందుకు సాగుతున్నారు. ఆదివారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఇందుకు సంబంధించిన కరపత్రాలను జర్నలిస్టులతో కలిసి విడుదల చేశారు. ప్రతి ఒక్కరు ప్రతి రైలుకు ఐదు సాధారణ భోగీలు ఉండాలని కోరుతూ ప్రధాన మంత్రికి ఉత్తరాలు రాయాలని పరికపల్ల అశోక్ విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఐదు లక్షల ఉత్తరాలను ప్రధాన మంత్రికి చేర్చినట్లు ఆయన తెలిపారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్



**ప్రజాపక్షం/కల్లూరుః** నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ కేసులు పెడతామని వ్యవ సాయ శాఖ అధికారి రూప, ఎస్సై షాకీర్ లు తెలిపారు. ఈ సందర్భంగా కల్లూరులో ఎరు వులు విత్తన దుకాణాలు పరిశీలించి రికార్డు లను తనిఖీ చేశారు. కాలం చెల్లిన విత్తనాలు నిల్వ ఉంచిన ఎరువులు నిషేధిత పురుగు మందులు విక్రయించవద్దని అలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుం టామని అధికారులు హెచ్చరించారు. రైతులకు నష్టం కలిగిస్తే సహించ బోమని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం దుకా ణాలు నిర్వహించుకోవాలని కోరారు. నకిలీ విత్తనాలు ఎరువులు విక్ర యిస్తే కఠినచర్యలు తీసుకుంటామని నకిలీ విత్త నాలు ఎరువులు విక్రయాలు అరికట్టడం కోసం మండలంలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ మండలంలో నిరంతరం తనిఖీలు చేస్తుందని అన్నారు. నకిలీ విత్తనాలు ఎరువులు అమ్ముతున్నట్లు అనుమా నాలు వస్తే వెంటనే అధికారులకు సమాచారాన్ని అందించాలని రైతులను కోరారు. కొనుగోలు చేసిన ఎరువులు విత్తనాలు పై వెంటనే రశీదులు పొందాలని ఎస్సై మరియు వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు. దుకాణాలలో నిర్వహణ రికార్డులు స్టాక్ బోర్డు దుకాణం కు సంబంధించిన రికార్డులు అందుబా టులో ఉంచాలని కోరారు.

# వైరాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు 4 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

**ప్రజాపక్షం/వైరాః** వైరాలో సోమవారం జరిగే గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్‌కు ఏర్పాట్లు చేశారు. పోలింగ్ సిబ్బందిని నియమిం చారు. పోలింగ్ సిబ్బంది ఆదివారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. వైరా మండలంలో 2830 మంది గ్రాడ్యుయేట్‌లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వైరాలో 4 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు పరిశీలిం చారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. పోలింగ్ ఏర్పా ట్లను తహశీల్దార్ శ్రీనివాసరావు, మున్సిపాలిటీ కమీషనర్ వేణు, ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజ్, పలువురు అధికారులు పరిశీలించారు.



# ఈము రైతులను ఆదుకోవాలి

## -కూనంనేనికి ఈము రైతుల వినతి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఈము రైతులను తక్షణం ప్రభుత్వం ఆదుకునేలా ప్రభు త్వంపై ఒత్తిడి తేవాలని ఈము రైతులు ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం సిపిఐ రాష్ట్ర కార్య దర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనం నేని సాంబశివరావుకు ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం ఈము రైతులకు సబ్సిడీ అందిస్తుందని తెలంగాణలో కూడా ఈము రైతులకు సబ్సిడీ అందించేలా ప్రభుత్వంతో మాట్లాడాలని వినతి పత్రంలో కోరారు. రైతుల సమస్యలను పరిష్కరిం చేందుకు చొరవ చూపాలని ఈము రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో గరికపాటి వెంకట్రావు, శ్రీనివాస్, ఆదినారాయణ, వీరయ్య, పాపిరెడ్డి, భరత్, గోవిందరావు, కృష్ణంరాజు, సత్యనారాయణరెడ్డి, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# బ్లూమూన్ హోటల్‌ను ప్రారంభించిన తుమ్మల



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని ఎన్నెస్టి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన బ్లూమూన్ హోటల్‌ను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఆదివారం ఎన్నెస్టి రోడ్డు శ్రీకృష్ణ ఆసుపత్రి పక్కన ఏర్పాటు చేసిన బ్లూమూన్ హోటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించి వారి ఆదరాభిమానాన్ని చూరగొనాలని యాజమాన్యానికి సూచించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వహకులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు దేవుని ప్రతిమను అందించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు కమర్తపు మురళి, పాలెపు విజయ వెంకటరమణ, సాధు రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

# చిన్నారులను ఆశీర్వదించిన మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిఆర్‌వో దూది పాళ్ళ విజయ్ కుమార్తె కుమారుల నూతన వస్త్ర అలంకరణ వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఆది వారం ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ గార్డె న్‌లో జరిగిన విజయ్ కుమార్తె బీష్మా, కుమా రుడు మోక్షిత్ ల నూతన వస్త్రలంకరణ వేడుకల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని చిన్నా రులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో నాయకులు సాధురమేష్‌రెడ్డి, కార్పొరేటర్లు కమర్తపు మురళి, మలీదు జగన్, ఆళ్ల అంజిరెడ్డి, కొప్పెర ఉపేందర్, ఎండి ఖాదర్ బాబా, బోడా శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# గృహ ప్రవేశ వేడుకల్లో పాల్గొన్న మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నూతన గృహప్రవేశ వేడుకల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొ న్నారు. నగరంలోని 14వ డివిజన్ గొల్లగూడెంలో ప్రముఖ జర్నలిస్టు అడపాల నాగేందర్ నూతన గృహప్రవేశ వేడుకల్లో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పాల్గొన్నారు. కొద్దిసేపు అక్కడ ఉండి వేడుక లకు వచ్చిన వారితో ముచ్చటించారు. ఈ కార్యక్ర మంలో నాయకులు సాధురమేష్‌రెడ్డి, కార్పొరేటర్లు కమర్తపు మురళి, మలీదు జగన్, ఆళ్ల అంజిరెడ్డి, ఎండి ఖాదర్ బాబా తదితరులు పాల్గొన్నారు.

# రఘునాథపాలెంలో 2,259 మంది ఓటర్లు





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పట్టభద్రుల ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో రఘునాథపాలెంలో 2,259 మంది ఓటర్లు ఉన్నారు. సోమవారం జరగనున్న ఎన్నికలకు సంబంధించి మండలంలోని పట్టభద్రుల ఓటర్ల కోసం రఘునాథపాలెం ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1,413 మంది పురుషులు, 846 మంది మహిళా పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. పోలింగ్ కేంద్రం 372, 373 కేంద్రాలను అక్కడ ఏర్పాటు చేశారు. పోలింగ్ సోమవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరగనుంది. పోలింగ్ బూత్‌ల వద్ద నీడ కోసం షామియానా, తాగునీరు, మరుగుదొడ్లు ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రానికి పోలింగ్ సిబ్బంది సామాగ్రి బూత్‌లకు చేరాయి. పోలింగ్ సిబ్బంది కోసం తగు ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సౌకర్యంతో పాటు అవసరమైన ఏర్పాట్లను చేశారు. తహసీల్దార్ లూథర్ విల్సన్, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్ ఏర్పాట్లను పరిశీలించారు.